## అధ్యాయము 24

# నిబంధన యొక్క ధృవీకరణ

19వ అధ్యాయములో దేవుడు ఇశ్రాయేలీయులతో చేసిన ఒడంబడిక యొక్క ధృవీకరణను నిర్గమ. 24 వివరిస్తుంది. తనతో కలుసుకొనుటకు ఇశ్రాయేలీయుల నాయకులను కొండమీదకు తీసుకొని రమ్మని దేవుడు మోషేతో చెప్పెను (24:1, 2). మోషే ప్రజలకు ధర్మశాస్త్రమును సమర్పించిన తరువాత, వారు దేవునికి విధేయులగుతామని వాగ్దానము చేసిరి (24:3-8). అప్పుడు మోషే, ఆహారోను, నాదాబు, అబీహు మరియు డెబ్బదిమంది పెద్దలు పర్వతము పైకి వెళ్లి, దేవుని చూచి, మరియు భోజనములో పాల్గొనిరి (24:9-11).

అప్పుడు యెహోవా మోషేతో, "నేను వ్రాసిన ఆజ్ఞలను, ధర్మశాస్త్రమును . . . నీకిచ్చుదనని" మోషేను తన యొద్దకు తిరిగి రమ్మనెను (24:12). మోషేయు మరియు యెహోషువయు పెద్దలను ఇశ్రాయేలీయుల శిబిరములో విడిచి, కొండమీదకు తిరిగి వెళ్లిరి (24:13, 14). మోషే దేవుని యొక్క మహిమ మేఘములోనికి ప్రవేశించెను, అక్కడ నలభై దినములు మరియు రాత్రులు అతడు గడిపెను (24:15-18).

## ధృవీకరణ ప్రక్రియ (24:1-11)

### దేవునితో కలుసుకోవాలనే ఆజ్ఞ (24:1, 2)

**1మరియు ఆయన మోషేతో ఇట్లనెను - నీవును, ఆహారోనును, నాదాబును, అబీహును, ఇశ్రాయేలీయుల పెద్దలలో డెబ్బదిమందియు యెహోవా యొద్దకు ఎక్కివచ్చి దూరమున సాగిలపడుడి. 2మోషే మాత్రము యెహోవాకు సమీపింపవలెను, వారు సమీపించకూడదు, ప్రజలు అతనితో ఎక్కి రాకూడదు.**

**వచనము 1.** మోషే ఇంకనూ పర్వతము మీద ఉన్నపుడు, **ఆహారోను, నాదాబు, అబీహు మరియు డెబ్బదిమంది పెద్దలతో యెహోవా యొద్దకు రమ్మని,** దేవుడు అతనితో చెప్పెను. మోషే మొదటిగా పర్వతము క్రిందకు వెళ్లి మరియు అప్పుడు పేర్కొనబడిన నాయకులతో మరలా పైకి రావలెనని ఈ ఆజ్ఞ ముందుగా ప్రతిపాదించినది.

**వచనము 2.** ఇతర ప్రజలందరు దూరములో నిలిచియుండగా, **మోషే మాత్రము**

**యెహోవాను సమీపింపవలెను.** ఇశ్రాయేలు దేవునికి పరిశుద్ధమైనది అయినప్పటికీ కూడా, తనకు ప్రత్యేకమైన సేవకునిగా మోషే ప్రత్యేకపరచబడ్డాడు.

## మోషే నిబంధనను ధృవీకరించుట (24:3-11)

**3మోషే వచ్చి యెహోవా మాటలన్నిటిని విధులన్నిటిని ప్రజలతో వివరించి
చెప్పెను. ప్రజలందరు - యెహోవా చెప్పిన మాటలన్నిటి ప్రకారము చేసెదమని
యేకశబ్దముతో ఉత్తరమిచ్చిరి. 4మరియు మోషే యెహోవా మాటలన్నిటిని వ్రాసి
ఉదయమందు లేచి ఆ కొండ దిగువను బలిపీఠమును ఇశ్రాయేలు పండ్రెండు గోత్రములు
చొప్పున పండ్రెండు స్తంభములను కట్టి 5ఇశ్రాయేలీయులలో యౌవనస్థులను పంపగా
వారు దహనబలుల నర్పించి యెహోవాకు సమాధానబలులుగా కోడెలను వధించిరి.
6అప్పుడు మోషే వాటి రక్తములో సగము తీసికొని పళ్లెములలో పోసి ఆ రక్తములో
సగము బలిపీఠము మీద ప్రోక్షించెను. 7అతడు నిబంధన గ్రంథమును తీసికొని ప్రజలకు
వినిపింపగా వారు - యెహోవా చెప్పిన మాటలన్నియు చేయుచు విధేయులమై
యుందుమనిరి. 8అప్పుడు మోషే రక్తమును తీసికొని ప్రజలమీద ప్రోక్షించి - ఇదిగో యీ
సంగతులన్నిటి విషయమై యెహోవా మీతో చేసిన నిబంధన రక్తము ఇదే అని చెప్పెను.
9తరువాత మోషే అహరోను నాదాబు అబీహు ఇశ్రాయేలీయుల పెద్దలలో
డెబ్బదిమందియు ఎక్కిపోయి 10ఇశ్రాయేలీయుల దేవుని చూచిరి. ఆయన
పాదములక్రింద నిగనిగలాడు నీలమయమైన వస్తువువంటిదియు ఆకాశమండలపు
తేజమువంటిదియు ఉండెను. 11ఆయన ఇశ్రాయేలీయులలోని ప్రధానులకు ఏ హానియు
చేయలేదు; వారు దేవుని చూచి అన్నపానములు పుచ్చుకొనిరి.**

దేవుని నిబంధనను ప్రజలతో ధృవీకరించుటను గూర్చి ఈ వచనములు వివరించారు. ఇశ్రాయేలు ప్రజలు ఆయనకు విధేయులైన యెడల వారు ఆయనకు ఒక ప్రత్యేకమైన జనాంగముగా ఉంటారు అని దేవుడు చెప్పాడు; ఇశ్రాయేలీయులు స్పందిస్తూ, “యెహోవా చెప్పినదంతయు చేసెదమని యేకముగా ఉత్తరమిచ్చిరి” (19:8). కాని, ఆ సమయములో, దేవుడు వారి యొద్ద నుండి ఏమి కోరతాడో అనే దానిని గూర్చి ఇశ్రాయేలీయులకు అంతగా తెలియలేదు. ఫలితంగా, వారు దేవుడు ఇచ్చే ఏ ఆజ్ఞనైనను వారు అంగీకరించారు. 20వ అధ్యాయములో మొదలుపెట్టి, వారి యొద్ద నుండి ఆయన ఏమి ఆశిస్తున్నాడో దేవుడు కొంత వివరంగా వారికి చెప్పాడు. ఆయన వారికి పది ఆజ్ఞలను బయలుపరచాడు (20:1-21), అలాగే నిబంధన గ్రంథములో ఇయ్యబడిన కొన్ని నియమాలను కూడా ఇచ్చాడు (20:22-23:33). వారిని గూర్చిన దేవుని చిత్తము యొక్క ప్రత్యేక అంశాలను వినిన తరువాత, దేవునికి విధేయులగునట్లు వారి నిబద్ధతను పునరుద్ధరించడానికి ఇశ్రాయేలీయులకు అవకాశం ఇవ్వబడినది. పర్యవసానముగా, “దేవుని ఆజ్ఞలు ఏమైయున్నాయో ఇప్పుడు మీకు తెలుసు కాబట్టి, ఇంకను మీరు వాటిని అనుసరించుటకు ఇష్టపడుచున్నారా?” అని ప్రజలను అడిగారు. ప్రజలు ఏ మాత్రం వెనుకాడక; మరలా, “యెహోవా చెప్పిన మాటలన్నిటి ప్రకారము చేసెదమని యేకశబ్దముతో ఉత్తరమిచ్చిరి!” (24:3; 24:7

కూడా చూడండి).

ఇశ్రాయేలీయులతో దేవుడు చేసిన నిబంధన యొక్క ధృవీకరణలో ఏడు సంఘటనలు ఉన్నాయి. (1) మోషే ధర్మశాస్త్రాన్ని చదివి వినిపించగా, ఇశ్రాయేలు ప్రజలు దేవునికి విధేయులమవుతామని తమ ప్రతిజ్ఞను పునరుద్ఘాటించారు (24:3). (2) యెహోవా యొక్క మాటలు వ్రాయబడినవి, ఈ విధముగా నిబంధనకు కొంత స్థిరత్వము ఇవ్వబడినది (24:4a). (3) ఈ సందర్భమును జ్ఞాపకము చేయుటకు ఒక బలిపీఠము కట్టబడినది (24:4b). (4) ధృవీకరణ కార్యక్రమము సందర్భంగా బలులు అర్పించబడ్డాయి, మరియు బలిపీఠము రక్తముతో ప్రోక్షించబడినది (24:5, 6). (5) తరువాత, పుస్తకము నుండి విధులు మరలా చదువబడ్డాయి, మరలా ప్రజల నుండి అనుకూలమైన స్పందనను రాబట్టింది (24:7). (6) నిబంధనను ముద్రించబడినది అనుటకు సూచనగా రక్తము ప్రజల మీద చిందించబడినది (24:8). (7) ఆఖరుగా, ఇశ్రాయేలీయుల నాయకులు దేవుని సమక్షంలో, నిబంధనా భోజనములో పాలుపొందారు (24:9-11).

**వచనము 3.** *ప్రతిజ్ఞను ధృవపరచడం.* మొదటిగా, **మోషే** కొండమీద నుండి క్రిందికి వచ్చినప్పుడు, **ప్రజలకు** వాటిని వివరించి చెప్పాడు. కలిసి నిలువబడి - ఐక్యంగా, **యేకశబ్దముతో** - దేవుడు ఆ ధర్మశాస్త్రాన్ని గూర్చిన వివరణలను ఇచ్చుటకు మునుపు పూర్వము చేసిన తమ విధేయతా ప్రతిజ్ఞను ప్రజలు మరలా చేసారు. **యెహోవా చెప్పిన మాటలన్నిటి ప్రకారము మేము చేసెదము** అని వారు అన్నారు.

**వచనము 4a.** *ధర్మశాస్త్రాన్ని వ్రాయడం.* రెండవదిగా, **మోషే** దేవుని మాటలను గట్టిగా చదివి వినిపించిన తరువాత, **ఆయన** వాటిని **వ్రాసాడు**, నిస్సందేహంగా దేవునికి మరియు ఇశ్రాయేలు ప్రజలుకు మధ్య దేవుడు చేసిన నిబంధనకు శాశ్వత నమోదుగా, మరియు ప్రత్యేకముగా ఆ నిబంధనలో ఉంచబడిన విధులకు సాక్ష్యముగా వ్రాసాడు అని చెప్పవచ్చు. ప్రాచీన పశ్చిమ ఆసియాలో నిబంధనలు వ్రాయబడడం మరియు ఒక ప్రత్యేకమైన స్థలములో దాచబడడం అనేది సాధారణం, ఎందుకంటే అక్కడ నుండి మరలా వాటిని తీసికొని అప్పుడప్పుడు చదివి వినిపించవచ్చు. బహుశా, మోషే ఆ కొండపైన ఉన్నప్పుడు దేవుడు ఆయనకు ఇచ్చిన **ఆజ్ఞలన్నిటిని** ఆయన వ్రాసి ఉంటాడు.

**వచనము 4b.** *బలిపీఠమును కట్టడం.* ఈ క్రమములో ఉన్న మూడవ దశ ఏమంటే సీనాయి కొండదిగువన ఒక **బలిపీఠము**ను కట్టడం. సుస్పష్టంగా, బలిపీఠమును నిర్మించడానికి గల ఉద్దేశం కేవలం బలి కొరకు ఒక స్థలాన్ని అందించడానికే కాదు, ఎందుకంటే ఇది **ఇశ్రాయేలు పండ్రెండు గోత్రములు చొప్పున పండ్రెండు స్తంభములతో** కట్టబడినది గనుక. బలులు ముగిసిన తరువాత, స్తంభములతో కట్టబడిన ఆ బలిపీఠము అక్కడ సంభవించిన సంఘటనకు సాక్ష్యముగా నిలిచిపోతుంది.

**వచనములు 5, 6.** *బలులను అర్పించడం.* నాల్గవదిగా, ఇశ్రాయేలు దేశములోని కొంతమంది **యౌవనస్థులచే దహనబలులును** మరియు **సమాధాన బలులును** అర్పించబడ్డాయి. సుస్పష్టముగా, ఇశ్రాయేలు దేశములో అధికారిక యాజకత్వము

ప్రారంభమగుటకు మునుపు, యౌవనస్థులు యాజకులుగా సేవిస్తూ, బలులను అర్పించునప్పుడు వారు బాధ్యత తెలుసుకొని ఉంటారు. ప్రత్యేకముగా ఎందుకు యౌవనస్థులు మాత్రమే చెప్పబడ్డారు? ఎందుకంటే, నరకడానికి, వధించడానికి, మరియు ఎద్దులను, మేకలను, మరియు గొట్టెలను చేరవేయడం అంటే చాలా బలం అవసరం గనుక. వీరు ఇశ్రాయేలు కుటుంబములలో జ్యేష్ఠ కుమారులు మరియు లేవీ గోత్రీయులైన వారు యాజకులుగా నియమింపబడుటకు పూర్వము వీరే యాజకులుగా పని చేశారు అని Walter C. Kaiser, Jr., సూచించాడు (సంఖ్యా. 3:41 చూడండి).[1] అప్పుడు **మోషే** బలిగా అర్పించబడిన పశువుల యొక్క **రక్తములో సగభాగమును** తీసికొని [దానిని] **బలిపీఠము మీద ప్రోక్షించెను.** బహుశా ఈ బలిపీఠమును ప్రతిష్ఠ చేయడానికి లేదా పరిశుద్ధ పరచడానికి ఈ బలియర్పణ చేయబడి ఉంటుంది.[2]

**వచనము 7.** *ధర్మశాస్త్రమును చదవడం.* అయిదవదిగా, మోషే ఆ ధర్మశాస్త్రాన్ని ప్రజలకు **చదివి** వినిపించాడు, మరియు వారు **యెహోవా చెప్పినవన్నియు చేయుద**మని తమ అంగీకారాన్ని మరలా చాటారు. John H. Walton మరియు Victor H. Matthews గమనించినట్లుగా, "ఒక నిబంధనలోని షరతులను చదివి వినిపించడం అనేది ప్రతి ఒక్క నిబంధన పునరుద్ధరణ కార్యక్రమములో భాగముగా ఉంది (యెహో. 24:25-27; 2 రాజులు 23:2; నెహెమ్యా 8:5-9 చూడండి)."[3] **నిబంధన గ్రంథము** అంటే దేవుడు ఇచ్చిన, మోషే వ్రాసిన, మరియు విధేయులమౌతామని ప్రజలు ప్రతిజ్ఞ బూనిన ఆ విధులు ఉన్న గ్రంథము. దేవునికి మరియు ఇశ్రాయేలు ప్రజలకు మధ్య చేయబడిన నిబంధన ఆధారితమైయున్న నియమాలు షరతులు ఈ గ్రంథములో ఉంటాయి. దేవుడు మరియు ప్రజల మధ్య ఉన్న నిబంధన అనుబంధము యొక్క కొనసాగింపు, వారు గ్రంథములో ఇవ్వబడిన ఆజ్ఞలను పాటించుట మీద ఆధారపడియుంది.

**వచనము 8.** *రక్తమును ప్రోక్షించడం.* ఆరవది, **మోషే** ఆ గ్రంథమును చదవగా దానికి ప్రజలు మరలా విధేయులమావుతామని చెప్పిన తరువాత, మిగిలిన **రక్తాన్ని** ఆయన **తీసికొని** దానిని నిబంధన ప్రజలపై ముద్రవేయబడింది అనుటకు సూచనగా **ప్రజల మీద ప్రోక్షించెను. నిబంధన రక్తము ఇదే** అని ఆయన అన్నాడు. రక్తముతో ఆ బలిపీఠము పరిశుద్ధపరచబడినట్లుగానే, లేదా ప్రత్యేకపరచబడినట్లుగానే, ప్రజలు కూడా పరిశుద్ధపరచబడ్డారు. దేవుడు ఇశ్రాయేలు ప్రజలను రక్షించి వారిని తన కొరకు ప్రత్యేకమైన జనముగా చేసుకున్నాడు అనే దానికి నిదర్శనం ఈ రక్త ప్రోక్షణ, మరియు దేవునికి విధేయులగుటకు వారికి బాధ్యత ఉంది.

ఈ సందర్భములో రక్తముతో చేసిన ఆచారము యొక్క ప్రాముఖ్యత బయలుపరచబడలేదు. రెండు సాధ్యాపసాధ్యాలను R. Alan Cole సూచిస్తున్నాడు. (1) బహుశా, ఈ ఆచారము ద్వారా, రక్తము ద్వారా ఆ ప్రజలతో సంబంధము కలిగియున్నానని దేవుడు చెప్తున్నాడు, తద్వారా ఇశ్రాయేలు ప్రజలు మరియు దేవుడు కూడా "ఒకే రక్తము"గా పరిగణింపబడి, దేవుడు ఇశ్రాయేలు ప్రజలకు తండ్రిగా మరియు "రక్తమునకు రక్తమును కోరువాడుగా"[4] ఉండగలుగుతాడు. (2) రెండవ విషయం ఏమంటే, ఆది. 15 మరియు యిర్మీయా 34:18లో కనబడే ఆచారములతో

పాటు, ఈ రక్త ఆచారము అనేది "ఒకవేళ ఎవరైనా ఈ నిబంధనలోని షరతులను ఉల్లంఘించిన యెడల వారి మీదికి మరణమును రప్పించుటకు చేయబడిన ఒక ఆచారముగా ఉండియుండవచ్చు."[5] Walter Brueggemann వ్రాస్తూ,

> "నిబంధన రక్తము" . . . రెండు వర్గముల మధ్య సంఘీభావాన్ని సృష్టిస్తుంది. నాటకీయమైన ఈ కార్యాన్ని హేతువులతో వివరించడం సాధ్యం కాదు, కాని జీవితమును సాధ్యపరచుటకు రక్తము అనేది చాలా ప్రత్యేకమైన మూలకం అనే విషయంలో ఎటువంటి సందేహమూ ఉండదు . . . ఇందుమూలముగా ఇశ్రాయేలు ప్రజలు ఇప్పుడు విధేయతతో కూడిన, బలియాగముతో, "నిబంధన గ్రంథముతో," మరియు "నిబంధన రక్తముతో" ప్రత్యేకపరచబడిన ఒక నూతన జీవితాన్ని ప్రారంభిస్తారు.[6]

రక్తాన్ని ప్రోక్షించడం అనేది "ప్రతిష్ఠపరచే లేదా పరిశుద్ధపరచే కార్యములో" ఒక భాగము, మరియు బలిపీఠముపైన ఉన్న రక్తము "దేవుని క్షమాపణను మరియు ఆ అర్పణను దేవుడు అంగీకరించాడు అనే విషయాన్ని" తెలియజేస్తుంది, మరియు ప్రజలపై ప్రోక్షింపబడిన రక్తము విధేయులుగా వారు ఉండునట్లు వారిని బంధించిన "ఒక రక్తముతో కూడిన మ్రొక్కుబడి"గా ఉన్నది అని Kaiser అన్నాడు.[7]

**వచనము 9.** *నిబంధనా భోజనమును భుజించుట.* నిబంధనను ధృవీకరించే క్రమములో ఇదే ఏడవ మరియు ఆఖరు సంఘటన. దేవుని ఆహ్వానంతో (24:1, 2), దేవుని సన్నిధిలో భుజించుటకుగాను **మోషే** తనతో కూడా ఇతరులను కొండమీదికి - బహుశ ఆ మార్గములో సగము వరకు మాత్రమే - తీసికొనివెళ్లాడు. ఈ భోజనములో పాలుపొందినవారు ఎవరనగా **అహరోను** మరియు అతని కుమారులైన **నాదాబు అబీహు** అనువారు, వీరే తరువాతి కాలములో "యెహోవా తమకు ఆజ్ఞాపింపని వేరొక అగ్నిని" యెహోవా సన్నిధికి తెచ్చుట వలన నశించారు (లేవీయ. 10:1, 2). ఇంకా కూడా ఉన్నవారు ఎవరనగా **పెద్దలలో డెబ్బదిమంది**, వీరే "ఇశ్రాయేలీయులలోని ప్రధానులు"గా తరువాత గుర్తింపబడ్డారు (24:11). ఈ పేరెన్నికగల మనుష్యులు బహుశ పండ్రెండ్రు గోత్రములకు ప్రతినిధులుగా ఉండి ఉంటారు.[8]

**వచనము 10.** ఈ భోజనములో పాలుపొందిన వారు **ఇశ్రాయేలీయుల దేవుని చూచిరి** అని వాక్యము చెప్తుంది, ఇదే సత్యము 11వ వచనములో కూడా పునరావృతమైనది. ఎవరును ఎన్నడును దేవుని చూడలేదు అని పరిశుద్ధ గ్రంథము వేరొక సందర్భములో చెప్తుంది కాబట్టి (33:20; యోహా. 1:18; 1 తిమోతి 6:16), వీరు దేవుని స్వయంగా చూచారు అనుటకంటే ఆయన యొక్క రూపాన్ని చూచారు అని అనవచ్చు. ఈ మనుష్యులు దేవుని యొక్క "పోలిక"ను చూచారు అని Kaiser సూచించాడు (సంఖ్యా. 12:8; యెష. 6:1; యెహె. 1:26 చూడండి).[9] "దేవుని నిత్యమైన మహిమ అంతటిలో ఆయనను 'ముఖాముఖి'గా వారు చూడలేదు" అని James Burton Coffman అన్నాడు (ద్వితీ. 4:15; 1 తిమోతి 6:16; 1 యోహా. 4:12 చూడండి).[10] దేవుడు "ఆత్మ" గనుక (యోహా. 4:24) - మరియు ఆత్మీయమైనదాన్ని భౌతికమైన నేత్రములతో చూడలేము గనుక - శరీరములో ఉన్న మానవుడు నిజానికి

దేవుని నిజరూపమును ఉన్నది ఉన్నట్టుగా చూడలేదు అని వాదించవచ్చు.

ఇక్కడ వ్రాయబడిన అనుభవము యొక్క వివరణను చూస్తే ఆ మనుష్యులు దేవుని **పాదముల క్రింద** మాత్రమే చూచినట్లుగా ఉంది, ఎందుకంటే తన పాదముల కంటే పైకి వీరి కన్నులను ఎత్తుటకు భయపడిపోయి ఉంటారు లేదా ఎత్తలేకపోయి ఉంటారు అని తెలుస్తుంది. అక్కడ వారు **నిగనిగలాడు నీలమయమైన వస్తువువంటిదియు ఆకాశమండలపు తేజమువంటిదియు** చూచారు.

**వచనము 11.** ఈ సంఘటన యొక్క అసాధారణమైన గుణాన్ని ఇక్కడ పేర్కొన్నారు. ఇశ్రాయేలీయులలోని నాయకులు దేవుని "చూచారు," **కాని ఆయన వారికి ఏ హానియు చేయలేదు.** "ఈ దృశ్యము దిమ్మెరపోయిన, నిర్ఘాంతపోయిన నిశబ్దాన్ని సూచిస్తుంది. వారు చూచి మైమరచిపోయారు. వారు మాట్లాడలేదు; వారు కదలలేదు . . . ఈ కథనము మనలను కూడా దిమ్మెరపోయి, తికమకపడి మరియు విస్మయపోవునట్లు చేయాలని ఇవ్వబడింది" అని Brueggemann అన్నాడు.[11] వేరొక విధంగా చెప్పాలంటే, "వారు దేవుని చూచారు, మరియు ఆయన వారిని చావగొట్టలేదు!"

అక్కడ ఉన్నవారు **అన్నపానములు పుచ్చుకొనిరి**, అంటే అప్పుడే దేవునితో వారు చేసుకొన్న నిబంధనను వేడుకగా చేసుకొనుటకు వారు భోజనములో లేదా పండుగలో పాలుపొందారు. దేవుడు వారితో కూడా కలిసి తిన్నాడు అని ఇక్కడ చెప్పకపోయినప్పటికీ, ఆయన యొక్క ప్రసన్నత మాత్రం ఉన్నట్లుగానే ఉంది. నిబంధనలోని ఇరుపక్షాలలో ఒక పక్షముగా, ఆయన అక్కడ ఉన్నాడు.

## ధర్మశాస్త్రమును స్వీకరించుట (24:12-18)

**12అప్పుడు యెహోవా మోషేతో ఇట్లనెను - నీవు కొండయెక్కి నాయొద్దకు వచ్చి
అచ్చటనుండుము; నీవు వారికి బోధించునట్లు నేను వ్రాసిన ఆజ్ఞలను, ధర్మశాస్త్రమును,
రాతిపలకలను నీకిచ్చెదననగా 13మోషేయు అతని పరిచారకుడైన యెహోషువయు
లేచిరి. మోషే దేవుని కొండమీదికి ఎక్కెను. 14అతడు పెద్దలను చూచి - మేము మీ
యొద్దకు వచ్చువరకు ఇక్కడనే యుండుడి; ఇదిగో అహరోనును హోరును మీతో
ఉన్నారు; ఎవనికైనను వ్యాజ్యమున్నయెడల వారియొద్దకు వెళ్లవచ్చునని వారితో
చెప్పెను. 15మోషే కొండమీదికి ఎక్కినప్పుడు ఆ మేఘము కొండను కమ్మెను.
16యెహోవా మహిమ సీనాయి కొండమీద నిలిచెను; మేఘము ఆరు దినములు
దానికమ్ముకొనెను; ఏడవ దినమున ఆయన ఆ మేఘములోనుండి మోషేను
పిలిచినప్పుడు 17యెహోవా మహిమ ఆ కొండ శిఖరముమీద దహించు అగ్నివలె
ఇశ్రాయేలీయుల కన్నులకు కనబడెను. 18అప్పుడు మోషే ఆ మేఘములో ప్రవేశించి
కొండమీదికి ఎక్కెను. మోషే ఆ కొండమీద రేయింబవళ్లు నలుబది దినములుండెను.**

**వచనము 12. కొండయెక్కి** దేవుని యొద్దకు **వెళ్లుటకు** మోషే మరొకసారి దేవునిచే ఆదేశింపబడ్డాడు. ఆయన ఇంకను ఆ పెద్దలతో అన్నపానములు పుచ్చుకొనుచునుండగనే ఈ ఆదేశాన్ని పొంది ఉంటాడు. వేరొక మాటలలో చెప్పాలంటే,

వారు కేవలం ఆ కొండలో సగభాగము మాత్రమే ఎక్కారు మరియు మోషేతో దేవుడు మరింత పైకి ఎక్కి ఆయన ప్రసన్నత వద్దకు రమ్మంటున్నాడు. “మోషే మాత్రము యెహోవాను సమీపింపవలెను” (24:2) అని చెప్పబడిన ఆజ్ఞను దీనికి ఆధారంగా చూపవచ్చు.

మరొక ఆలోచన ఏమంటే, “పైకి యెక్కి” రమ్మని దేవుడు మోషేకు ఆజ్ఞాపించినప్పుడు మోషే మరియు పెద్దలందరూ కూడా తమ శిబిరం లోనికి వచ్చేసి ఉంటారు. చట్టపరమైన వివాదాల బాధ్యత వహించుటకు ఆహారోను మరియు హూరు అనువారలను మోషే నియమించాడు అనే సత్యము ఏమి సూచిస్తుంది అంటే, వారు తిరిగి ప్రజల మధ్య ఉన్నారు అని (24:14; ఇంకా 18:26 చూడండి) సూచిస్తుంది. ఏమైనప్పటికీ, నలుబది దినములు తరువాత మోషే ఆ కొండమీద నుండి క్రిందికి వచ్చినప్పుడు, అహరోను శిబిరములోనే ఉన్నాడు (అధ్యాయము 32).

ఈ సందర్భంలో మోషే కొండమీదికి వెళ్లడానికి గల ఉద్దేశము **రాతిపలకలమీద** దేవుడు తనంతట తానే **వ్రాసిన** ధర్మశాస్త్రాన్ని స్వీకరించడానికి. ఈ రెండు రాతిపలకల మీద ధర్మశాస్త్రములోని ఏయే భాగములు వ్రాయబడ్డాయో అనే విషయంపై పండితులు ఒక కొలిక్కి రాలేకపోతున్నారు - అది కేవలం పదిఆజ్ఞలు మాత్రమేనా లేక ఇతర చట్టాలు కూడా వ్రాయబడి ఉన్నాయా అనే విషయంపై వాదనలు ఉన్నాయి. “ఇక్కడి కథనము యొక్క నేపథ్యంలో చూస్తే,” **ఆజ్ఞలు మరియు ధర్మశాస్త్రమును** అనునవి “కేవలం ఆ పది మాటలను మాత్రమే సూచిస్తున్నాయి” అని Cole అభిప్రాయపడ్డాడు.[12] ఈ పలకలను “శాసనములు గల పలకలు” గాను (31:18) మరియు “నిబంధన సంబంధమైన పలకలు” గాను (ద్వితీ. 9:9) పిలువబడ్డాయి.

**వచనములు 13, 14. మోషే** పైకి వెళ్లాడు, తనతో **యెహోషువ**ను తీసికొనివెళ్లాడు. కాని, ఆయన పైకి ఎక్కుటకు మునుపు, ఆయన కొరకు **ఇక్కడనే ఉండమని** తన **పెద్దలతో** చెప్పాడు. ఒకవేళ వారు మునుపు అన్నపానములు పుచ్చుకొనిన ప్రదేశములోనే ఉండియుంటే, బహుశ మోషే వారితో అక్కడనే “వేచి” ఉండమని చెప్పి ఉంటాడు. కాని, వారు శిబిరంలో ఉన్నట్లయితే, అప్పుడు వారు ప్రజలతోనే వారు ఉండాలని చెప్పి ఉంటాడు. ఏది ఏమైనప్పటికీ, ఆయన కొరకు వెదకుచు వారు ఆ కొండను ఎక్కి రావాలని ఆయన అనుకోలేదు.

**వ్యాజ్యెములను** తీర్చడానికి మోషే **అహరోను మరియు హూరు** అనువారలను నియమించి వెళ్లాడు. న్యాయము తీర్చడం అనేది సాధారణంగా మోషే యొక్క పని, కాని ఆయన అక్కడ అందుబాటులో ఉండడు. సుళువైన వివాదాలను పరిష్కరించడానికి “పెద్దలు” అనబడే “డెబ్బది” మంది ఉన్న మనుష్యులు (24:1) నియమింపబడి ఉంటారు (18:22, 23 వచనములపై గల వ్యాఖ్యలను చూడండి).

**వచనము 15.** అప్పుడు మోషే **కొండమీదికి ఎక్కినప్పుడు ఆ మేఘము కొండను కమ్మెను.** ఈ దృశ్యాన్ని ఒకసారి ఆలోచించండి: మోషే “మునుపెన్నడూ ఎవరు వెళ్లని ప్రదేశానికి వెళ్లాడు. ఆయన మానవతా స్థలాన్ని విడచి దేవుని పరిధిలోనికి వెళ్లాడు. మరియు అక్కడ ఆయన నలుబది పగళ్లు మరియు నలుబది రాత్రిళ్లు ఉన్నాడు . . . ఎవరికి కూడా, అహరోను కాని లేదా ఇశ్రాయేలు ప్రజలకు కాని . . . ఆయన తిరిగి

వస్తాడో లేదో అసలు తెలియదు."[13]

**వచనములు 16-18.** అప్పుడు యెహోవా మహిమ సీనాయి కొండమీద . . . ఆరు దినములు కమ్ముకొనెను. క్రింద ఉన్న ఇశ్రాయేలీయుల శిబిరములో, యెహోవా మహిమ ఆ కొండ శిఖరముమీద దహించు అగ్నివలె వారి కన్నులకు కనబడెను. మోషేకు దేవుని యొక్క పిలుపు ఏడవ దినమున వచ్చింది. మోషే ఆ మేఘము మధ్యలోనికి ప్రవేశించాడు, దేవుని యొక్క ప్రసన్నతలోనికే ప్రవేశించాడు, మరియు ఆయన అక్కడ రేయింబవళ్లు నలుబది దినములుండెను. "దేవుని వ్రేలితో వ్రాయబడిన రాతిపలకలను" (31:18) స్వీకరించిన మోషేను దేవుడు కలుసుకొనగా ఆయన యొక్క మహిమ పరిపాలన చేసింది.

## అన్వయము

### దేవుడు చెప్పినవాటినన్నిటిని చేయడం (24:3, 7)

మోషేతో దేవుడు చెప్పిన *సంగతులన్నిటిని* ఆయన వారితో చెప్పాడు, మరియు వారు *అందరూ* యెహోవా వారికి ఆజ్ఞాపించిన *వాటినన్నిటిని* పాటిస్తాము అని చెప్పారు. ఇలా చెప్పుటకు మీరు సిద్ధముగా ఉన్నారా? దేవుడు ఆజ్ఞాపించే వాటిని అన్నిటిని చేయుటకు కొన్నిసార్లు ప్రజలు అయిష్టంగా ఉంటారు. ఉదాహరణకు, వారు చిన్న చూపు చూడవచ్చు లేదా బాప్తిస్మము పొందమని దేవుడిచ్చిన ఆజ్ఞను విస్మరించవచ్చు. దేవుని రాజ్యమును మొదట వెదకుచు (మత్తయి 6:33), ఆయన మనకు ఆజ్ఞాపించిన సమస్తమును చేయుటకు మనము ప్రయాసపడుదుము.

### రక్తముతో శుద్ధీకరింపబడడం (24:5-8)

దేవునికి మరియు ఇశ్రాయేలు ప్రజలకు మధ్య చేయబడిన నిబంధన రక్తముచే ధృవీకరింపబడింది. పశువులు బలిచేయబడ్డాయి, మరియు బలిపీఠము మీదను మరియు ప్రజల మీదను రక్తము ప్రోక్షింపబడినది (24:5-8). హెబ్రీ. వ్రాసిన పత్రిక 9:18-20 వచనములలో ఈ సందర్భము ప్రస్తావించబడినది. బలిపీఠమును మరియు ప్రత్యక్ష గుడారమును ప్రతిష్ఠించునప్పుడు కూడా రక్తము ఉపయోగింపబడేది అని అక్కడి సందర్భము తెలుపుతుంది (హెబ్రీ. 9:21; నిర్గమ. 29:12, 36; లేవీయ. 8:15, 19 చూడండి). హెబ్రీ. 9:22 వచనము సాధారణంగా రక్తముచే కడుగబడు "సమస్తము"ను గూర్చి మాట్లాడుతుంది, బహుశ పాపముల నిమిత్తము తరచు అర్పించబడే అర్పణలను గూర్చి కూడా ప్రస్తావిస్తూ ఉండవచ్చు.

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక యొక్క రచయిత ఏమి చెప్తున్నాడు? ధర్మశాస్త్రము ఉన్నప్పుడు, "రక్తము చిందింపకుండ పాపక్షమాపణ కలుగదని" చెప్తున్నాడు (హెబ్రీ. 9:22). క్రొత్తనిబంధన క్రింద జీవిస్తున్న వారు ఒక శ్రేష్ఠమైన బలి - అనగా యేసు యొక్క బలినే - కలిగియున్నారు. ఆయన బలియాగము ఎందుకు శ్రేష్ఠము అంటే ఆయన నిజమైన పరిశుద్ధ స్థలము లోనికి ప్రవేశించాడు (హెబ్రీ. 9:24); ఆయన తన

బలియాగమును ఒక్కసారి మాత్రమే చేసాడు (హెబ్రీ. 9:25, 26); జంతువుల బలికి విరుద్ధముగా పాపమును తొలగించుటకు ఆయన తన్నుతాను బలిగా అర్పించుకొన్నాడు (హెబ్రీ. 9:26; 10:4). ఆయన రక్తము సంఘమును కొన్నది (అపొ. 20:28). ఆయన రక్తము మనలను రక్షించింది (ఎఫెసీ. 1:7), అది ఇంకను మనలను రక్షిస్తూనే ఉంది (1 యోహా. 1:7), మరియు అది మనలను నిత్యత్వములో కూడా రక్షిస్తుంది (ప్రకటన 7:14).

### "నిబంధన రక్తము" (24:8)

ప్రభురాత్రి భోజనాన్ని యేసు స్థాపించిన్నప్పుడు సీనాయి దృశ్యము ఆయన మనసులో ఉంది. "ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుతున్న నిబంధన రక్తము" అని ఆయన అన్నాడు (మత్తయి 26:28). యేసు మరణించినప్పుడు, ఒక "నూతన నిబంధన"ను ఆయన మనుగడ లోనికి తెచ్చాడు (యిర్మీయా 31:31-34 చూడండి). రక్తముచే ధృవీకరింపబడిన రక్తముచే ఇశ్రాయేలు ప్రజలు దేవునితో ముడిపేయబడియుండగా, అలాగే క్రీస్తు శిష్యులమైన మనము కూడా. "దేవుని గొఱ్ఱెపిల్ల" యొక్క రక్తముచేత ఈ క్రొత్త నిబంధన స్థిరపరచబడింది.

### దేవునితో భుజించడం (24:9-11)

నిర్గమకాండము 19వ అధ్యాయములో దేవుడు ఇశ్రాయేలీయులతో చేసిన నిబంధనను నిర్గమకాండము 24లో ధృవపరచాడు. ఇరు పక్షాలు - అనగా దేవుడు మరియు ఇశ్రాయేలు ప్రజలు - ఆ నిబంధనలోని షరతులకు అంగీకారాన్ని తెలిపారు. నిర్గమ. 24లో ఉన్న పారంపర్యాచారాల ద్వారా, ఈ నిబంధన అమలులోనికి వచ్చింది. నేటి కాలములో రియల్ ఎస్టేట్ వ్యాపారములోని ఒప్పందముతో 19వ అధ్యాయమును పోల్చవచ్చు; కాని నిర్గమ. 24లో ఉన్న ఆచారములను ఆ ఒప్పందానికి ముగింపు కార్యక్రమముగా చూడవచ్చు.

24వ అధ్యాయములో చెప్పబడిన ఆచారములలో ఈ క్రింది విషయాలను చూడవచ్చు: (1) మోషే ధర్మశాస్త్రమును ప్రజలకు చెప్పడం మరియు దానిని పాటిస్తామని ప్రజలు తమ ప్రతిజ్ఞబూనడం (24:3); (2) రాబోయే తరముల కొరకు ఆ నిబంధనను వ్రాయడం (24:4a); (3) ఒక బలిపీఠమును కట్టడం (24:4b); (4) బలులను అర్పించి ఆ రక్తమును బలిపీఠముపై ప్రోక్షించడం (24:5, 6); (5) ఆ ధర్మశాస్త్రములోని విధులను చదవడం మరియు వాటిని పాటిస్తామని ఇశ్రాయేలు ప్రజలు మరలా చెప్పడం (24:7); (6) ప్రజలను రక్తముతో ప్రోక్షించడం (24:8); మరియు (7) దేవునితో ఆ సహవాసపు భోజనాన్ని భుజించడం (24:9-11). ఈ సమయములో ఇశ్రాయేలు ప్రజలలో అధిపతులు కూడా దేవుని చూచినట్లుగా చెప్పబడింది (24:10).

పాత నిబంధన కాలములలో భోజనములో పాలుపొందడం అనేది సదరు నిబంధన

ఇరు పక్షాల మధ్యన ముగించినట్లు అనుటకు సూచనగా ఉండేది. ఈ విషయములో, నిబంధన చేయబడినది ఇశ్రాయేలు ప్రజలకు మరియు దేవునికి మధ్య, కనుక ఇశ్రాయేలు ప్రజలు ఈ భోజనాన్ని దేవునితో పంచుకొన్నారు. వారు "దేవునితో కూడా తిన్నారు"! ఈనాడు "దేవునితో భుజించే" విధానాన్ని గూర్చి ఒకసారి ఆలోచిద్దాం.

*క్రైస్తవులముగా అగుట ద్వారా, మనము పెండ్లి విందులో పాలిభాగస్తులము అవుతున్నాము (మత్తయి 22:1-14).* ఒక విధంగా చూస్తే, క్రైస్తవులముగా ఉండుట ద్వారా మనము "దేవునితో తింటున్నాము." మనము ఆయనతో సహవాసము కలిగి ఉంటున్నాము; "జీవ జలమును" ఆనందిస్తూ "జీవాహారము"ను భుజిస్తున్నాము.

*క్రైస్తవులముగా, ప్రభురాత్రి భోజనములో పాలుపొందినప్పుడు, మనము "దేవునితో కూడా భుజిస్తున్నాము."* యేసు ప్రభురాత్రి భోజనాన్ని ప్రవేశపెట్టినప్పుడు, "నా తండ్రి రాజ్యములో మీతోకూడ నేను ఈ ద్రాక్షారసము క్రొత్తదిగా త్రాగు దినమువరకు, ఇకను దాని త్రాగను అని మీతో చెప్పుచున్నాను" అన్నాడు (మత్తయి 26:29). దీని అర్థం ఏమంటే ఆయన దేవుని రాజ్యములో మనతో తిని త్రాగుతాడు అని. ప్రభురాత్రి భోజనములో మనము పాలుపొందినప్పుడు, మనము చూడగలుగుతున్న మనము మన తోటి క్రైస్తవులతో మాత్రమే కలిసి భుజించుటలేదు గాని, మనము చూడలేని క్రీస్తుతో కూడా భుజిస్తున్నాము. ప్రభురాత్రి భోజనము "ప్రభువు బల్ల"గా కూడా చెప్పబడింది (1 కొరింథీ. 10:21; మత్తయి 18:20 చూడండి).

*ఇరత క్రైస్తవులతో మనము భోజనములను మరియు సహవాసమును పంచుకొన్నప్పుడు, ఒక విధముగా మనము కూడా దేవునితో కలిసి భుజిస్తున్నాము.* క్రొత్త నిబంధన సంఘములో కలిసి భుజించడం అనేది చాలా సాధారమైన విషయం (అపొ. 2:46; 1 కొరింథీ. 11). దేవుని కుటుంబములో వారందరు ఒకరినొకరితో దగ్గర సంబంధం కలిగి ఉన్నారు అనుటకు భోజనములను పంచుకోవడం అనేది ఒక కారణం, ఒక పర్యావసానం, మరియు ఒక సూచన.

*క్రైస్తవ కుటుంబాలు భోజన సమయాలను మనము "దేవునితో భుజించే" సమయాలుగా పరిగణించాలి.* మనం భోజనమును బట్టి దేవునికి కృతజ్ఞతలు చెల్లించినప్పుడు ఆయన ప్రసన్నతను మనము గుర్తిస్తున్నాము (లూకా 24:30; యోహా. 6:11; రోమా. 14:6; 1 తిమోతి 4:4, 5). కుటుంబములుగా మనము భుజించేటప్పుడు మనము ఆయన పనిని జరిగిస్తున్నాము ఎందుకంటే అటువంటి "కుటుంబ సహవాసము"ను అలవాటు చేయడం ద్వారా తల్లిదండ్రులుముగా మన పిల్లలకు మనం చేసేదాని యంతటికంటే కూడా ఎక్కువగానే తమ పిల్లలకు చేయగలుగుతున్నాము. మన కుటుంబములతో సమయమును గడుపుతూ ఆత్మ సంబంధమైన విషయములను మాట్లాడుకొనుచున్నప్పుడు మన జీవితాలను మనం విశ్రాంతి పరచుకొనుచు దేవుని మహిమపరుస్తున్నాము (ద్వితీ. 6:7). కుటుంబ భోజన సమయాలను కుటుంబ ఆరాధన కొరకు మనము ఉపయోగించినప్పుడు మనము దేవునితో చాలా సమీపముగా కట్టబడుతున్నాము.

*నిత్యమైన విందులో మనము పరలోకములో దైవికమైన సహవాసాన్ని అనుభవిస్తాము; అంటే ఒక విధంగా, మనము ఎన్నటెన్నటికీ "దేవునితో భుజిస్తాము."*

దేవుని కొరకు జీవించువారి కోసం పరలోక విందులాంటిది ఒకటి ఎదురు చూస్తున్నది (లూకా 22:30; ప్రకటన 19:9). ప్రకటన గ్రంథము 22:1, 2లో వాడబడిన దృష్టాంత పరిభాష ఆధారముగా, పరలోకములో దేవుని సింహాసనము నుండి ప్రవహిస్తూ, అంటే త్రాగుటకు శుద్ధమైన నీటిని సూచించే, ఒక సుందరమైన నది ప్రవహిస్తుంది అని తెలుస్తుంది. జీవవృక్షము పండ్రెండ్రు విధములైన ఫలములను ఫలిస్తుంది, అంటే రుచికరమైన భోజనము తినుటకు అక్కడ కలదు అని తెలుస్తుంది. “తన భర్త కొరకు అలంకరింపబడిన పెండ్లికుమార్తెవలె” ఉన్నదని (ప్రకటన 21:2) పరలోక యెరూషలేమును చిత్రీకరించడం చూస్తే, దేవుడు పరలోకాన్ని ఒక పెండ్లివిందుతో పోల్చుతున్నాడు అని తెలుస్తుంది. అక్కడ దేవునితో మనకుండే అన్యోన్య సహసవాసము “దేవునితో భుజించడం” అన్నట్లుగా ఉంటుంది.

*ముగింపు.* దేవునితో భుజించుటకు ఇశ్రాయేలీయుల పెద్దలకు భాగ్యము కుదిరింది, మరియు మనకు కూడా ఇదే భాగ్యము కలుగవచ్చు. మన హృదయములు అనే తలుపుల వద్ద యేసు తట్టుచున్నాను, ఆయన మనతో భుజించునట్లు లోనికి రావడానికి చూస్తున్నాడు (ప్రకటన 3:20). తన చిత్తమునకు విధేయులగుట ద్వారా తన సహవాసమునకు ఎల్లప్పుడు మనము సిద్ధముగా ఉందాం.

---

సూచనలు

[1]Walter C. Kaiser, Jr., “Exodus,” in *The Expositor's Bible Commentary*, vol. 2, *Genesis-Numbers* (Grand Rapids, Mich.: Zondervan, 1990), 449. [2]Ibid. [3]John H. Walton and Victor H. Matthews, *Genesis-Deuteronomy*, The IVP Bible Background Commentary (Downers Grove, Ill.: InterVarsity Press, 1997), 121. [4]R. Alan Cole, *Exodus: An Introduction and Commentary*, Tyndale Old Testament Commentaries (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1973), 185-86. [5]Ibid. [6]Walter Brueggemann, “The Book of Exodus,” in *The New Interpreter's Bible*, ed. Leander E. Keck (Nashville: Abingdon Press, 1994), 1:881. [7]Kaiser, 449. [8]Walton మరియు Matthews, 120. [9]Kaiser, 449. [10]James Burton Coffman, *Commentary on Exodus, The Second Book of Moses* (Abilene, Tex.: ACU Press, 1985), 348.

[11]Brueggemann, 881. [12]Cole, 187. [13]Brueggemann, 882.